
రోడ్డు మూసేసిన కృష్ణానగర్ కాలనీవాసులు

మందుబాబులతో వేగలేకనే ఈ ఏర్పాటు అంటున్న కాలనీ వాసులు


కృష్ణానగర్ కాలనీలో రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన గేటు..

కుషాయిగూడ: మందు బాబులతో మేము వేగలేమంటూ హెచ్‌బీకాలనీ, కృష్ణానగర్ కాలనీవాసులు కాలనీకి చెందిన ప్రధాన రోడ్డును మూసేశారు. నిబంధనలను ఉల్లంఘించి ఏకంగా రోడ్డుపై పెద్ద గేటును బిగించి మరి రోడ్డు క్లోజ్ చేశారు. ఈ చర్య స్థానికంగా నివసించే వారితో పాటుగా వ్యాపారాలు చేసుకునే వారికి ఇబ్బందిగా మారిందంటున్నారు. సాయంత్రం ఆరు దాటితే గేటు మూసివేస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారని వాపోతున్నారు. నిత్యం ఆ రోడ్డు గుండా వెళ్లే వారికి ఏం చేయాలో తోచనిస్థితిలో ఉన్నారు. అయితే ఇటీవలే కృష్ణానగర్ రోడ్డు నెంబరు 11,12 సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఓ షెడ్డు నిర్మాణం చేసి వైన్స్ షాపును ఏర్పాటు చేశారు. దీంతో సాయంత్రం సమయంలో వైన్స్‌షాపుకు వచ్చే మందుబాబులు మద్యం సీసాలతో కాలనీలోకి ప్రవేశించి ఎక్కడ పడితే అక్కడే మద్యం తాగుతూ హంగామా చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల వల్లే రోడ్డును మూసివేయాలని నిర్ణయించుకున్నామని కాలనీవాసులు అంటున్నారు. చీకటి పడిదంటే అటువైపుగా వెళ్లలేని పరిస్థితులు దాపురించాయని గత్యంతరం లేని పరిస్థితుల్లో గేటు ఏర్పాటు చేశామంటు వారి వాదనలు వినిపిస్తున్నారు. ఇంతా జరుగుతున్న అధికారుల్లో మాత్రం చలనం లేదు.

గౌడ సంఘం సంక్షేమానికి కృషి



మల్లాపూర్: మల్లాపూర్, మీర్‌పేట్ గీత పారిశ్రామిక సహకారం సంఘం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ కొండిన గౌడ యువజన సంఘం మల్లాపూర్, మీర్‌పేట్ సహకారం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర 2024 కేలండర్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌడ సంఘం బిల్డింగ్‌పై అదనపు అంతస్తు నిర్మాణానికి తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు.

సోషల్ మీడియా కో ఇన్‌చార్జిగా గణేష్ నాయక్



బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కో ఇన్‌చార్జిగా చెంగిచర్లకు చెందిన ఎ. గణేష్ నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా గణేష్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలోనే తాగునీటి సమస్యకు పరిష్కారం


సప్తగిరి ఎన్‌క్లేవ్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: సప్తగిరి ఎన్‌క్లేవ్‌తో పాటు పరిసర ప్రాంత కాలనీలకు తాగునీటి సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనుందని కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. ఆదివారం సప్తగిరి ఎన్‌క్లేవ్‌లో పర్యటించిన ఆయన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జలమండలి అధికారులతో మాట్లాడి పైప్‌లైన్ జంక్షన్ కనెక్టివిటీ పూర్తయ్యిందని వచ్చే వారం రోజుల్లో ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ పూర్తయి నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు.

మహాపాదయాత్ర పూర్తి చేసిన గురుస్వామికి ఘన స్వాగతం



కుషాయిగూడ: అయ్యప్ప మాలధరణలో శబరి మహాపాదయాత్ర చేసి తిరిగి వచ్చిన చర్లపల్లి, సోనియాగాంధీనగర్ కాలనీ అధ్యక్షుడు వెల్డింగ్ శ్రీను గురుస్వామికి ఆయన శిష్యగణం ఘన స్వాగతం పలికింది. నవంబరు–18న శబరి బయలుదేరిన ఆయన అయ్యప్ప దర్శనం పూర్తి చేసుకొని నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గురుస్వామిని ఘనంగ సత్కరించి అభినందించారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



రామంతాపూర్ : సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల 1993 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అప్పటి సంఘటనలను నెమరుస్తూ జ్ఞాపకం చేసుకుంటూ ఆనందించారు. కరస్పాండెంట్ సునీల మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్న స్థానాల్లో ఉండటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, సుభాష్, రాజు, సమీర్, మాధవి, లత తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి గుండం బాలాజీ బ్రహ్మోత్సవాలు

అల్వాల్: అల్వాల్‌లోని గుండం బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం నుండి 5వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని తెలిపారు.

ఘనంగా భాష్యం వార్షికోత్సవం



గౌతంనగర్: విద్యార్థులు విద్యార్థి దశలోనే ఇష్టంగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులకు తేవాలని ఉగ్రం సినిమా డైరెక్టర్ విజయ్ అన్నారు. మల్కాజిగిరి భాష్యం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు లక్ష్మీసాయి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయ్‌తోపాటు భాష్యం విద్యా సంస్థల సీఈవో చైతన్య, జోనల్ ఇంచార్జి మార్కెండేయులు, ప్రిన్సిపల్ కోమలిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

క్రైస్తవులకు అండగా ఉంటాం



ఉప్పల్: క్రైస్తవులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ది పెంతెకొస్తు మిషన చర్చిలో క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను అందజేశారు. అనంతరం చర్చి పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో గోన పిలిప్స్, మత్తయ్య, జగన్నాథ్, పాల్‌సన్, యోహాను , జగన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: కాలనీల అభివృద్ధిలో కాలనీ సంక్షేమసంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శివసాయినగర్ శివాలయంలో ఆదివారం జరిగిన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం, నూతన సంవత్సర కేలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డిలతో కలిసి ఆయన కేలెండర్ ఆవిష్కరించారు. అలాగే నూతనంగ ఎన్నికైన శివసాయినగర్ కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, ప్రదాన కార్యదర్శి బర్ల రాంచంద్రారెడ్డి, కొండగళ్ల అశోక్, నారా నర్సింహులు, కాసుల సురేష్, సరికొండ రమేష్, జూపల్లి అశోక్‌తో పాటుగా ఇతర కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

తాగునీరు నేలపాలు..పట్టించుకోని అధికారులు



రామంతాపూర్ : శ్రీనివాసపురంలోని శంకర్ కిరాణా స్టోర్ ఎదురుగా గత నెల రోజులుగా తాగునీరు పైప్‌లైన్ నుంచి లీకైన నీరు రోడ్లపైకి వరదలా వచ్చి ప్రవహిస్తూ చిన్న చెరువులా తయారైంది. ఈ విషయాన్ని జల మండలి అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి పైప్‌లైన్‌లో అనుకుని ఎలక్ట్రికల్ కేబుల్ ఉందని, ఆ కారణం చేతనే తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు ఆలస్యం అవుతున్నాయని అధికారులు అంటున్నారు. జల మండలి విద్యుత్ విభాగం సమన్వయంతో వెంటనే తాగునీటి లీకేజీని అరికట్టాలని, లేదంటే సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని వర్తక సంఘం నేత బాలయ్య హెచ్చరించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



మేడిపల్లి: సక్రాంతి పండుగ సంబరాలను పురస్కరించుని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి డివిజన్ పన్నాల ఎన్‌క్లేవ్‌లో ఆదివారం స్థానిక కార్పొరేటర్ బైటింటి శారధ ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు స్థానిక మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ప్రారంభించారు. మహిళలు,యువతులు పెద్ద ఎత్తున పోటీల్లో పాల్గొని వివిధ రకాల రంగులతో అందమైన రంగవల్లులను తీర్చి దిద్దారు.అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి మేయర్ బహుమతులను అందజేశారు.

రాములోరి అక్షింతలతో శోభాయాత్ర



మల్లాపూర్: అయోధ్యలో వచ్చే నెల 22న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అయోధ్య పూజిత అంక్షితలు ఆదివారం మల్లాపూర్‌కి చేరాయి. భక్తులు, బాజా భజంత్రీలు, భజనల మధ్య మంగళ హారతులతో స్వాగతం పలికారు. అక్షింతలను జనవరి 16 వ తేది వరకు ప్రతి ఇంటికి అక్షింతలను పంపిణీ చేస్తామన్నారు. ఈ శోభాయాత్రలో, జె.కిషన్ మారుతీరావ్,ముత్యరెడ్డి, ఎనుముల మహేష్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, నరేంధర్ రెడ్డి, ఆంజానేయులు, దొడ్డి యాదగిరి, నిర్మల, సుజాత, సబిత. తితరులు పాల్గొన్నారు.



ఇంటింటా రామజ్యోతి వెలిగించాలి

బోడుప్పల్: జనవరి 22వతేదీన అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటింటా రామజ్యోతి వెలిగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పులకండ్ల జంగారెడ్డి అన్నారు. ఆదివారం శ్రీరామ అక్షింతలు బోడుప్పల్ హనుమాన్ దేవాలయం నుంచి శ్రీకృష్ణ దేవాలయంలో ఆయన సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముడు ఆదర్శ పురుషుడని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏనుగుల లక్ష్మయ్య, ధర్మారెడ్డి, దిలీప్‌రెడ్డి, కొడే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు



బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ ఈసంవత్సర మధుర స్మృతులను నెమరువేసుకుంటూ కొంగొత్త ఆలోచనలతో నూతన సంవత్సరంలోకి అడుగిడగాలన్నారు. కేక్‌ను కట్ చేసి విద్యార్థులు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈకార్య క్రమంలో పాఠశాల ఇన్‌చార్జి విజయ్‌కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ పరిధిలో హనుమాన్ నగర్ వెల్ఫేర్ సొసైటీలో ఆదివారం నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభానికి ముఖ్య అధిదిగా నగర డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అద్యక్షుడు రాజసింహ చారి,ఉపాద్యక్షుడు అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ కేలండర్ ఆవిష్కరణ



హబ్సిగూడ: హబ్సిగూడ జైసంతోషినగర్ సీనియర్ సీనియర్ సీటిజన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. హబ్సిగూడ డివిజన్ అధ్య క్షులు డాక్టర్ చారి, ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి, రత్నం, ఆంజాద్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్యం..



ఉప్పల్ : ఉప్పల్ మిని శిల్పారామంలో నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. గీత పూజిత శిష్య బృందం చే నిర్వహించిన మూషిక వాహన, అష్టలక్ష్మీ, నొత్తుశ్వర, అలరింపు, రంగపూజ, మహాలక్ష్మీ అష్టకం, స్వజతి, ఆనంద నర్తన, గణపతిమ్, కృష్ణ శబ్దం తదితర అంశాలను వర్షిత, సురాధ్య, ధీమహి, నిహిత, తపస్వీ తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి


మందులు పంపిణీ చేస్తున్న సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: పేద, మధ్య తరగతి ప్రజల కోసం తరుచుగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలో ఆదివారం నీలిమా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. ఈవైద్య శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షల తోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సీఈఓ నీలిమా, ఆర్గనైజర్ భరత్‌రెడ్డి, నేతలు కందుల వినోద్, ఉప్పరి విజయ్, మోతే రాజు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్ప స్వాములు

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల కాలనీలకు చెందిన అయ్యప్ప స్వాములు మాలాధారణ చేసి 41 రోజులు ఉపవాస దీక్షలు చేసి ఆదివారం నరసింహ గురు స్వామి ఆధ్వర్యంలో భారీ ఎత్తున శబరికి బయలుదేరారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, బీఆర్ఎస్ సీనియర్ నేత సర్వబాబు యాదవ్, అయ్యప్ప మాలధారణతో అన్ని శుభాలే జరుగుతాయని అదే విధంగా అయ్యప్ప స్వాములు యాత్ర ముగిసే వరకు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఘనంగా అయోధ్య అక్షింతల ఊరేగింపు

అల్వాల్: అల్వాల్‌లో అయోధ్య అక్షింతల ఊరేగింపు శోభయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్వాల్‌లోని బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి ప్రారంభమైన యాత్ర శ్రీనివాసనగర్, రెడ్డి ఎన్‌క్లేవ్, ప్రశాంత్‌నగర్, వాసవినగర్ మీదిగా గంగపుత్ర కాలనీలోని ప్రసన్నంజనేయ స్వామి ఆలయం వారకు కొనసాగింది. విశ్వహిందు పరిషత్ సభ్యులు, శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ క్షేత్ర సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కేలండర్ ఆవిష్కరణ



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రెడ్డి ఐక్యవేదిక ప్రతినిధుల ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ను మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆదివారం మేడిపల్లి సంపూర్ణ హోటల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్‌రెడ్డి,అనంత రెడ్డి,యుగెందర్ రెడ్డి,పప్పుల అంజిరెడ్డి,రెడ్డి ఐక్యవేధిక అద్యక్షుడు రాజిడి వెంకట్ రెడ్డి కార్యవర్గ సభ్యులు దితరులు పాల్గొన్నారు.